## పేరుపేరునా కృతజ్ఞతలు: ఎంపీ నామా



ఖమ్మం, డిసెంబర్ 1: ఈ శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభాపక్షనేత నామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ పార్టీకి, అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ చెబుతున్నట్లు చెప్పారు. పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని అన్నారు.

## ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

- సత్తుపల్లి నియోజకవర్గంలో 87 శాతం పోలింగ్ నమోదైంది
- అభిమానులు, కార్యకర్తలు బోగస్ ప్రచారాలను నమ్మవద్దు
- బీఆర్ఎస్ సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య


మాట్లాడుతున్న వెంకటవీరయ్య

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 1: నియోజకవర్గంలో గత నెల 30న జరిగిన ఎన్నికల్లో తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని బీఆర్ఎస్ సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 87 శాతం పోలింగ్ నమోదైనట్లు చెప్పారు. పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్ నివాసం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సండ్ర మాట్లాడారు. మూడోసారి కూడా కేసీఆరే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారని చెప్పారు. అయితే, ఒక వైపు పోలింగ్ జరుగుతున్నప్పటికీ సాయంత్రం ఐదున్నర గంటలకే కొన్ని సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేయడం ద్వారా ఓటర్లు అయోమయానికి గురయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ విషయాన్ని తమ పార్టీ పెద్దలు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో సాయంత్రం ఐదు గంటల తర్వాత 31 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు. అయితే, నియోజకవర్గంలో మొదటి నుంచి బోగస్ ప్రచారాలు చేసేవారు ఉన్నారని, వారు తన గెలుపుపై కూడా బోగస్ ప్రచారాలు చేస్తూ మానసిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ఓటర్లు తనపై నమ్మకంతో తనను గెలిపించేలా ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. ఇలాంటి బోగస్ ప్రచారాలను నమ్మి బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలెవరూ మనోధైర్యం కోల్పోవద్దని సూచించారు. ఇలాంటి బోగస్ ప్రచారాలతో గిట్టనివాళ్లు తాత్కాలిక ఆనందం పొందుతుంటారని, కానీ గెలుపు మాత్రం తనవైపే ఉందని అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా బూత్‌ల వారీగా పూర్తిస్థాయిలో సమీక్ష జరిపి మీదట తాను నాలుగోసారి కూడా భారీ మెజార్టీతో గెలుపొందనున్నట్లు తేలిందని అన్నారు. రాత్రి 11 గంటల వరకు పోలింగ్ జరిగిన తర్వాత నియోజకవర్గవ్యాప్తంగా జరిపిన సర్వేలో నూటికి నూరుశాతం సత్తుపల్లిలో బీఆర్ఎస్ గెలుపొందనుందని తేలిందన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులు, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కృషిచేసిన పోలీసులకు తాను పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మన్ వనమా వాసు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావులతోపాటు వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## శ్రమించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

**బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు**



మధిర, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించేందుకు సైనికుల్లా శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు. గురువారంతో ఎన్నికల ప్రక్రియ ముగిసినందున శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులో బీఆర్ఎస్ తరపున ఈ నియోజకవర్గంలో తను రెండుసార్లు పోటీ చేశానని, 2018 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ఈ ఎన్నికల్లోనూ సీఎం, పార్టీ అధినేత కేసీఆర్ తనకు అవకాశం కల్పించడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి ఎన్నికలు పూర్తయ్యేంత వరకు తన వెన్నంటి ఉంటూ, తన తాను విజయం సాధించడం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అహర్నిషలూ కృషి చేశారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీయే ముందంజలో ఉంటుందని, సీఎం కేసీఆర్ మూడోసారి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారని తెలిపారు. తనకు ఓటు వేసిన ప్రతి ఓటరుకూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు.

- ఈసారి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీగా పెరిగిన పోలింగ్ శాతం
- ఖమ్మంలో 83.83 శాతం, భద్రాద్రిలో 80.20 శాతం నమోదు
- కట్టుదిట్టమైన భద్రత మధ్య కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలు
- ఖమ్మంలో శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు
- పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో కౌంటింగ్
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు

### కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో గురువారం పోలింగ్ ప్రక్రియ ముగియడంతో శుక్రవారం ఉదయానికల్లా అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎం బాక్సులు భారీ భద్రత మధ్య ఖమ్మం, కొత్తగూడెంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకున్నాయి. ఖమ్మం రూరల్ మండలం శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల ఓట్లను లెక్కించనున్నారు. పాల్వంచ అనుబోస్ కళాశాలలో భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల ఓట్లను లెక్కించనున్నారు. కౌంటింగ్ ప్రక్రియకు ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు 18 టీములను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్ వద్ద ఒక సూక్ష్మ పరిశీలకుడిని ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్‌ను నియమించారు. అదనంగా 20 శాతం సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఏఆర్‌వోలు ఈ లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభంకానుంది. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఒక ప్రత్యేక మార్గాన్ని, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం మరో ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రాల్లో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను రెండు జిల్లాల కలెక్టర్లు పరిశీలించి కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచించారు.

# రేపే ఓట్ల లెక్కింపు





ఖమ్మంలో కౌంటింగ్ కేంద్రంలో ఆర్‌వోకు సూచనలిస్తున్న కలెక్టర్, పాల్వంచలో ఈవీఎంలను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్

ఖమ్మం, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ సారి భారీగా నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే ఖమ్మం జిల్లాలో 2018 ఎన్నికల కంటే ఈ సారి పెరిగింది. భద్రాద్రి జిల్లాలో మాత్రం స్వల్పంగా తగ్గింది. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ ఖమ్మం జిల్లాలో 5 గంటలకు పూర్తయింది. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలో సాయంత్రం 4 గంటలకే ముగించారు. అయితే, అనేక పోలింగ్ కేంద్రాల వద్ద సమయానికి కటే ముందే ఓటు వేయడానికి వచ్చి క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లను అధికారులు ఓటింగ్‌కు అనుమతించారు. అనేక గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. కొన్ని చోట్ల ఈవీఎంలు నిదానంగా పనిచేయడం వల్ల కూడా కొంత ఆలస్యమైంది. మధిర, ఖమ్మం, వైరా, పాలేరు నియోజకవర్గాల ఈవీఎం బాక్సులను గురువారం రాత్రికే ఖమ్మంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కాలేజీలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించారు. సత్తుపల్లి ప్రాంతంలోని ఈవీఎంలను శుక్రవారం కౌంటింగ్ కేంద్రానికి చేర్చారు. కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కౌంటింగ్ కేంద్రానికి వచ్చిన ఈవీఎం బాక్సులను పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేలా ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో అత్యధిక పోలింగ్ పాలేరు నియోజకవర్గంలో జరిగింది. ఇక్కడ 2,36,287 మంది ఓటర్లు ఉండగా 2,14,810 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం 91.52గా నమోదైంది.

**నియోజకవర్గాల వారీగా ఓటింగ్ వివరాలు**

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| పినపాక | 1,98,402 | 1,58,978 | 80.13 |
| ఇల్లెందు | 2,19,569 | 1,76,840 | 80.54 |
| కొత్తగూడెం | 2,43,846 | 1,86,347 | 76.42 |
| అశ్వారావుపేట | 1,55,961 | 1,35,501 | 86.88 |
| భద్రాచలం | 1,48,661 | 1,17,447 | 79.00 |
| **మొత్తం** | **9,66,439** | **7,75,113** | **80.20** |

ఇక అత్యల్పంగా ఖమ్మం నియోజకవర్గంలో నమోదైంది. ఇక్కడ 3,22,996 మంది ఓటర్లు ఉండగా 2,30,724 మంది ఓటు వేశారు. దీంతో అత్యల్పంగా 71.43 శాతం నమోదైంది. మధిరలో 2,21,326 మంది ఓటర్లుండగా 1,94,615 మంది ఓటుహక్కు వినియోగించుకోవడంతో 87.93 శాతం నమోదైంది. వైరా నియోజకవర్గంలో 1,93,069 మంది ఓటర్లుండగా 1,67,389 మంది ఓటుహక్కును వినియోగించుకోవడంతో 86.70 శాతం నమోదైంది. సత్తుపల్లి నియోజకవర్గంలో 2,43,118 మంది ఓటర్లుండగా 2,12,549 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 87.43 శాతంగా పోలింగ్ నమోదైంది. గతంలో పోలిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం 83.83 శాతంగా నమోదైంది. ఇది బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటుందని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్ల ఈసారి ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపడంతోపాటు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపించారని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక భద్రాద్రి జిల్లాలో అత్యధికంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో 86.88 శాతం పోలింగ్ నమోదుకాగా అత్యల్పంగా కొత్తగూడెంలో 76.42 శాతం నమోదైంది. పినపాక నియోజకవర్గంలో 80.13 శాతం, ఇల్లెందులో 80.54 శాతం, భద్రాచలంలో 79 శాతం నమోదైంది. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 80.20 శాతం పోలింగ్ నమోదైంది. 2018 ఎన్నికల్లో 81 శాతం పోలింగ్ నమోదుకాగా ఈసారి స్వల్పంగా తగ్గింది.

### ఓటింగ్‌లోనూ మహిళలే అధికం..

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): జనాభాలోనూ, ఓటర్లలోనూ అధిక సంఖ్యలో ఉంటున్న మహిళలు ఓటింగ్‌లోనూ అదేతీరును కనబర్చారు. గురువారం జరిగిన పోలింగ్ వారి శాతమే అధికంగా ఉంది. కాగా, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించడంతో జిల్లాలో 709 మంది ఇంటి నుంచే ఓటు వేశారు. ముఖ్యంగా యువతీ యువకులు, మహిళలు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. భద్రాద్రి జిల్లాలో 9,66,439 మంది ఓటర్లు ఉండగా 7,75,113 మంది ఓటు వేశారు. అత్యధికంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో 1,55,961 మంది ఓటర్లకుగాను 1,35,501 మంది ఓటు వేశారు. అత్యల్పంగా కొత్తగూడెంలో 2,43,846 మంది ఓటర్లకుగాను 1,86,347 మంది ఓటు వేశారు. జిల్లా వ్యాప్తంగా 80.20 శాతం ఓటింగ్ నమోదైంది. కాగా, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో 4,94,650 మంది మహిళా ఓటర్లు ఉండగా వారిలో 3,94,501 మంది ఓట్లు వేసి 79.75 శాతాన్ని నమోదు చేశారు. ఇతరులు 44 మందికిగాను 25 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట బందోబస్తు: సీపీ


కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులకు సూచనలిస్తున్న సీపీ విష్ణు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 1: శాసనసభ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద, స్ట్రాంగ్ రూముల వద్ద 144 సెక్షన్‌తోపాటు మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కాలేజీలో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు జరగనుండగా.. అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు సీపీ పలు ఆదేశాలు జారీ చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా దిశా నిర్దేశం చేశారు. మూడంచెల భద్రతలో భాగంగా మొదటి అంచెలో కేంద్ర బలగాలు, రెండో అంచెలో సాయుధ బలగాలు, మూడో అంచెలో సివిల్ పోలీసులు భద్రత నిర్వహిస్తున్నట్లు వివరించారు. అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా అగ్నిమాపక పరికరాలను సైతం అందుబాటులో ఉంచామన్నారు. అదనపు డీసీపీ, ఏసీపీలు పర్యవేక్షణలో పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్, కేంద్ర బలగాలు పహారా కాస్తున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కచ్చితమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. పోలీసు అధికారులు ప్రసాదరావు, హరికృష్ణ, బస్వారెడ్డి, ప్రసన్నకుమార్, రెహమాన్, రామానుజం, రవికుమార్, సాంబరాజు, నర్సయ్య పాల్గొన్నారు.